# అనుమానమూ - అనురాగమూ

"ఏరాజీ"

రైలుబండీ ఆగిన పెద్దరైల్వే స్టేషను, కంటే అధికంగా కోలాహలం, హడావుడీ యిను మడించిన బజార్లోంచి సూర్యం నాలుగు సంవత్సరాల తర్వాత ఏవేవి మార్పులొచ్చాయి—ఎక్కడెక్కడ ఏ యే కొత్త దుకాణాలు వెలిసేయి—ఏ సందులను వెడల్పు చేసేరు — ఏరోడ్లను మూసేసేరు — అని పరకాయించి చూస్తున్నట్లు నడుస్తున్నాడు.

మహాఅయితే ఐదేళ్లయ్యిందేమో. ఈ క్రమ శిక్షణలేని సందడినించి తను దూరమైగాని అదివరకు అసలు రోజూ సాయంతరం యీ సదిబజారుగుండా వెళ్లకపోతేనే అదోలావుండేది.

ఐతే అప్పటి సూర్యం వేరు. ఇప్పటి పీ. హెచ్. డి. సూర్యం వేరు. ఇప్పుడు ఆవూరు తనవూరు కాదు. తను చదువుకోసరం ఆవూరు, ఆరాష్ట్రం తర్వాత యీదేశం యిత్యాదులు వదిలేసేడు. తన కుటుంబం అంటే వున్నతల్లీ ఒక చెల్లీ తాతగారి వూళ్లోనే స్థిరమయిపోయింది. అంతమాత్రంచేత సూర్యానికి తన వయస్సులో సగంపైగా అంటె పదిహేను సంవత్సరాలు అక్కడే గడిచిన స్మృతులేవీ పూర్తిగా చెరిగిపోలేదు.

అతడు యిప్పుడుకూడా అదే సెంటిమెంటు, అదే మమకారం 'ఫీ'లవుతున్నాడు. అంత ఎద్దడిగానూ తొక్కిడిగానూ వున్నా ఆస్ట్రేలియాలో తను గతమూడు సంవత్సరాలు గడిపిన జీవితానికి ఆ మురికి పట్టణవీధులకీ యెంతో తేడా వున్నా, అతని మనసులో ఏదో అవ్యక్తమయిన ఆనందం వున్నది.

ఎదురీతగా రోడ్డుకి రాంగుసైడ్న, నడుస్తున్నాడు సూర్యం. ఆ సంగతి అతనికి స్ఫురణకి రానేలేదు. పైగా తనపెద్ద చదువు తన సంస్కారాన్ని ఏమాత్రం పాడుచెయ్యలేదనుకున్నాడు. లేకపోతే తనేమిటి ? యీ దుమ్మూ ధూళీ కొట్టుకునిపోయిన రోడ్డుమీద, వాడిపోయిన వాలిపోయిన ఎడ్లజతం ఎధ్య పాత తపన ఏడడమేమిటి ? అవి తన సంస్కారానికి గౌరవానికి విదర్శనం కాదా మరి.

తనను దూసుకునిదాటిన ఒక వ్యక్తిని సూర్యం గతుక్కుమని వెనుదిరిగి చూసేడు. గబుక్కున ఆగి — మళ్లీ ఎందుకనో మనసుమార్చుకుని వెళ్లిపోదామనుకున్నాడు. ఇంతలో ఎవరో **వెనకనించి 'మిస్టర్ సూర్యం' అని పిల్చేరు.**

"అరె! ఎన్నాళ్ల కెన్నేళ్లకని ? ఎప్పుడురాక? ఎందు వాసము ? కుశలంబే ? ఏమిటి విశేషంబు ?" — అంటూ తన పాతఫ్రెండు "అంబుశర్మ" — ఆ రద్దీలో నిలదీసి ముమ్మరంగా ప్రశ్నల బాణాలు కురిపించేసేడు. అతని ప్రక్కనేవున్న ప్రౌఢాంగన.—

"అరె! సూర్యంగారేనా, యిప్పుడు నామ్ముదునించే నన్ను దాటేసేరు." అని దెప్పిపొడిచింది రెండుచేతులు జోడించి నమస్కారయుక్తంగా వుంచి.

"అబ్బే. . . లేదు. . . లేదు. . . సారీ" అని సూర్యం నాలిక్కర్చుకుని "మీరు మిస్. లీలావతి కౌనా కాదా"ని అంటూ నసిగి. . . శర్మనుద్దేశించి "ఐతే మీరు . . . ఉహూహూ. . కాదు నువ్వు యింకా "అంబు" భాష వదలలేదన్న మాట?" అన్నాడు.

సిటబ సూర్యమే తను యింతదనుక నేర్చుకున్న పాశ్చాత్య నాగరికతని వినియోగించి "లీడ్" దీసుకుని "రండి రండి కొంచెమేదయినా . . . డ్రింకుదాం" — అని శీతల పానీయములు ఎల్లవేళలా దొరకును అన్న షాపులోనికి దారి తీసేడు.

"నువ్వంటే విదేశయానంబు సలిపిన అత్యధిక విద్యాసంపన్నుండవు, జ్ఞానాంబుధుండవు ఐనావ్ — మేమో కేవలం ఎన్‌జీఓలం —ఒట్టి జీరోలం అంచేత కేవలంబు "కూలు డ్రింకు తాం". . . . శర్మ కుర్చీలో చతికిలబడతూనే నాదం మొదలెట్టేడు. అసలు శర్మ మొదట్నించీ చిన్న విదూషకుడిలాగ నలుగుర్నీ నవ్వించి తిరిగేవాడు. అతడి పెళ్లాం నలుగురు పిల్లల పరిశీలనగా చూసేడు.

"నేనూ మిస్టర్ శర్మ కొలీగ్సుమి., నేను మరి గ్రాడ్యుయేట్ అయ్యేక చదువు అవుసరం అనుకోలేదు. . . అదిసరేగాని మీరు సంగతులేమీ చెప్పేరుకాదు. . . మాదేమున్నదిలెండి మనం మన దేశమూ, గోడింబిళ్లాటా గొంగళీపురుగు **లానూ. . ." అని నవ్వేసింది లీలావతి, సూ**ర్యంకూడా అందుకుని ఏహో మాటలుచేర్చి గబగబా అనేసి నవ్వేసేడు.

సీరియస్‌గా ఐస్‌క్రీము తింటున్న శర్మ పిళ్లనుద్దేశించి ఏదో అనబోయి, మళ్లీ అమాంతం వున్న "క్రీము"తా నోట్లో చెంచాతో తోసుకుని "నన్ను మన్నించవలె. . . తిరిగికలుసు వాడ. . . . తక్షణంబు ఒక గొల్లబావ 'అరపాలడబ్బా' — సహితుండనై గృహోన్ముఖుండ నగువాడ"నని లీలావతికేసి సూర్యం -గబగబాచూసి చరచరా వెళ్ళిపోయాడు.

"శర్మ ఫిక్యూలియర్ ఫెలో కదూండీ"అన్నది లీలావతి చేతో ఐస్ క్రీం చెంచాని టబుల్ కానుక ని వుంచుకుని.

సూర్యం ఆమెకళ్ళతో కళ్ళు అప్రయత్నంగా కలిపినవాడు గభిక్కున మరల్చుకొని "ఏం మీర లేదు" అని ఐస్‌క్రీం తినడానికి ప్రయత్నం చేసాడు.

"ఎవరు? నేనా? శర్మా?" అన్నది లీలావతి.

సూర్యం యిద్దరూనూ అన్నాడు సందిగ్ధంగా.

"అయితే మీరు యిప్పుడు ఎక్కడ దిగారు - మీ ఫామిలీ యిక్కడ లేదుకదూ?" ఎదురుగా వున్న అద్దంలోని సూర్యం బింబాన్ని అడిగినట్టు అడిగింది లీలావతి.

దొంగతనంగా అద్దంలో ఆమెకేసి చూస్తున్న అతగాడు, "అబ్బే! ఎవరూ లేరు, ఫ్రెండ్సుకోసమే వచ్చేను. రేపో, ఎల్లుండో వెళ్ళిపోతాను" అని సమాధానమిచ్చి, మళ్ళీ అదేమీ అంత ఎఫెక్టివ్‌గా లేదనుకున్నవాడిలాగ "మరి చూసేనుగా యిక వెళ్ళిపోతా" నన్నాడు.

బిల్లు చెల్లించి యివతలకు వచ్చాక, "మీ యిల్లెక్కడ? అంతవరకూ ఎక్స్‌కార్ట్‌వుదునా లేక మరి సెలవు తీసుకోనా?" అన్నాడు సూర్యం సభ్యతా, సంస్కారం ఉట్టిపడుతూ.

"భలేవారే! నేను యిక్కడ యిల్లు పట్టుకుని వుండగా మీరు హోటల్లో వుండడమేనా సబబు? అని ఎత్తిపొడుపుగా మాట్లాడి, మళ్ళీ అన్నది అయినా వసంత ఆతిథ్యమూ, ఔన్నత్యమూ నా దగ్గర ఎక్కడివి లెండి"

ఆ దెప్పిపొడుపుకి సూర్యం మరింత చలించిపోయాడు. అతగాడు వచ్చింది సరిగా వసంత కోసమేనని లీలావతి ఎలా పసిగట్టిందోనని ఆశ్చర్యపడ్డాడు.



గండభేరుండ పక్షి....

ఫొటో: యం. యస్. చౌదరి.

“ఊహూహూ ... అతిగాను, ఎందుకూ ... శ్రమ .... ... ...'' అనిగేసేం. లీలావతి మరేమీ నీ సంజాయిషీలు వినను అన్నట్లు వారించి, ఒక ఆటోరిక్షాను పిలిచింది.

సూర్యం మొహమాటంగా ప్రక్కనే కూర్చున్నాడు. ఇంతవరకు వాళ్ళిద్దరికీ ఒకరినొకరు పరిశీలనగా చూసుకోగల అవకాశమే చిక్కింది కాదు. అదో జనప్రవాహం.

సూర్యం మవునంగా ఆమెను క్రీగంట చూసాడు. ఆఫీస్ డ్రెస్‌కనుక తెల్లనిచీర కట్టుకున్నది. ఐనా ఆమె వంటికి హత్తుకుని సోభించే నీలం “బ్లవుజు'' వేసుకున్నది. ... చేతికి గడియారం, అదిలేనిచేతికి రెండేరెండు బంగారంవి కాబోలు గాజులూ, కాలికి పసుపూవుల మహమల్‌ఛెప్పులూ, అతగాడింతకంటే ఏమీ అలంకారాలు ఫీలవలేదు. అతని అవసరం లేదు కూడా.

మామూలుగా వయస్సులోవున్న ప్రతి ఆడపిల్లనీ ఆమాత్రం యీమాత్రం బుద్ధివున్న ప్రతియువకుడు చూసే కోణంలోంచి మాత్రం చూసేడు. పోతే లీలావతి అతనికి రెండుసంవత్సరాల్లు క్లాస్‌మేట్. చాలా చనువైన కలివిడితనంగల సంస్కారవతి అని అతని వుద్దేశ్యం.

ఆమె యింటిదగ్గరదిగి తొందరపడి ఆటోకి డబ్బులిస్తున్నప్పుడు సూర్యం ఆమెను మరింత ఇదిగా చూసేడు. జాకెట్టుకీ, చీరకీమధ్య ఎర్రగా వదిలేసిన ఆమె జానెడువీపుమీద అతను హాయిగా చూసేడు.

అంతలో వసంత జ్ఞాపకాని కొచ్చింది. వసంత కోసం తను వచ్చాడు. వసంత యిదివరకున్న యింట్లో లేదు. మరెక్కడుందో తెలియదు.

వసంత గురించి లీలావతికి తప్పకుండా తెలుస్తుంది. అసలు తను వసంతకు వుత్తరం వ్రాసి రెండుసంవత్సరాలు. ఈ తలంపుతో అతనికి గుండె ఝుల్లుమన్నది. లీలావతివెనకాలే యింట్లోకి వెళుతున్నవాడు అనాలోచితంగా అక్కడే నిలబడిపోయాడు.

ఆమె వెనక్కుతిరిగి పలుకరించి, “కొత్త చేస్తున్నారా? బెట్టుచేస్తున్నారా'' అని నవ్వింది. అంత పచ్చి హ్యూమర్‌కికూడా! సూర్యం నవ్వలేదు. లీలావతి అహంకారం దెబ్బతిన్నది.

వసంతకోసమే అయ్యుంటుంది అని క్రోధం పట్టింది ఆమె మనస్సు అనవసరంగా.

నిజంగా లీలావతికి సూర్యం అక్కరలేదు. మర్యాదా, సంస్కారమూ పాటించి, పాతస్నేహాన్ని పురస్కరించుకుని ఆహ్వానించింది అంతే.

అయినా అతిథి సూర్యం ఆమెనేమీ అడుగలేదు. అనుకున్నట్టు చెప్పుకుంది. అధవు ఇప్పుడు ఏ ఉద్యోగంయినా చేస్తున్నారా? ఉద్యోగం చేస్తున్నారే మరి తర్వాత ఏం ఆశయమేమిటి? అని ప్రశ్నలు వెయ్యటం లేకపోగా, ఇన్నివుండి మీరు అడవిగాచిన వెన్నెలగా జీవితాన్ని వృధాచేస్తున్నందుకు ''మ్యారేజ్'' చేసుకోండిలాంటి సలహాకూడా యివ్వలేదు.

లీలావతి ముమ్మురంగా అతని మూభావం గురించి ఆలోచిస్తూ కాఫీకోసుగర్ మరింతకలిపి సూర్యం ముందుకు నెట్టింది కప్పును.

సూర్యం కాఫీతాగుతూ “మీ ఆతిథ్యంలో తీపి మరీ ఎక్కువపాళ్ళు వేస్తున్నారే!'' అని వ్యంగ్యంగా చెప్పేడు. ఆమె మాట్లాడలేదు.

తర్వాత “వసంత గురించి చెప్పేరుగాదు''— కప్పు టక్కున సాసర్లో వుంచుతూ.

అప్పుడయినా “ఏం? అన్యమనస్కంగా వున్నారు?'' అని అతగాడు అడిగివుంటే లీలావతి అహం అంతగా దెబ్బతినకపోను.

ఆడపిల్లల గుండెల్లో తార్కిక చర్చకి తావుండదు. హృదయం ఎంత చెబితే అంత వింటారు. లీలావతికి ఒక్కసారి ప్రిజుడిస్ కలిగింది.

“వసంత, వసంత అని ఒకటే చంపుతున్నారు. ఆమెగారు యిక్కడ లేరు. విశాఖపట్నంల.

గాబోలు వాళ్ల మావయ్య ఎవరో అక్కడ వుంటున్నాడట'' అని జవాబిచ్చింది. 'మావయ్య' అన్న పేరును అర్థవంతంగా నొక్కుతూ.

''అయితే చాలా రోజులయిందన్నమాట...'' అన్నాడు సూర్యం. అతనికి యీ ప్రశ్నతో తప్పని సరి ''అసలు వసంతకి పెళ్లయిపోయిందేమిటి చెప్పవా'' అన్న శంక అతగాడ్ని పీడిస్తున్నది. లీలావతి నవ్వింది. అందులో మంజులనాదం కంటే కర్కశమే ఎక్కువ పాళ్లున్నది.

''పోయిన సంవత్సరంనించీ కాబోలు'' అని పూరుకుంది. ఈ ఒక్కవాక్యం దావానలంలాంటిది. సూర్యం తట్టుకోలేకపోయేడు.

తర్వాత సంభాషణ ఎలాగ పొడిగించాలో తెలియక అతడు పూరుకున్నాడు.

లీలావతి ''తిరపతమ్మా !'' అని పిలిచి సూర్యానికి ఫలాని గదిలో పక్కవేయమని పురమాయించింది.

సూర్యంకేసి తిరిగి ''ఈమె మా అత్తయ్య అవుతుంది వరుసకి — తలచెడ్డది, దిక్కుమాలినది. అంచేత నాకు గార్డియన్‌షిప్పూ, వంట మనిషిరిక్కంగూడా యిచ్చేసాను'' అని తిరపతమ్మ గురించి సందర్భోచితంగా చెప్పింది.

భోజనాలయ్యేకా సూర్యం చాలాసేపు తనకి కొంత అయిష్టమే అయినా — ఆస్ట్రేలియా తన రిసెర్చి, అక్కడి మనుషులూ, వింత తరహాలు గురించి మాట్లాడేడు. లీలావతి కొంత విన్నది, కొంత వదిలేసింది.

మధ్య మధ్య తిరుపతమ్మ మాత్రం ''జొనుష ''జొనుష! మా ఒడ్డి శంకరంగారబ్బాయి కూడా ఇంగిలీషు వెళ్లొచ్చేక యిలాంటివి కుప్పలు కబుర్లు చెప్పేవాడు. అని ఆవిడకి వున్న జ్ఞానాన్ని వ్యక్తపరిచేది.

మధ్యలో అవకాశం చిక్కించుకొని ఆవిడ సూర్యం పుట్టుపూర్వోత్తరాలూ — పెళ్లి కట్నం లాంటి చిల్లర సంగతులూ భోగట్టా చేసింది కూడాను.

లీలావతి కొంతసేపయ్యేక కణతలు నొక్కుకొని 'మరి లేద్దామా' అని విసుగుగా అడిగింది.

సూర్యం వెంటనే లేచేడు. ఆమె ఆతిథ్యాన్ని వుద్దేశించి ''థాంక్యూ'' అన్నాడు. వుదయమో, రేపు మధ్యాహ్నమో వెళ్లిపోతాను మరి'' అన్నాడు. తనకై వేసిన పడగ్గదికేసి నడుస్తూ.

లీలావతి వెనక్కి తిరిగి ''నొ మెన్షన్'' అనలేదు. నవ్వుతూ ''వసంతని మర్చిపోండి — లేకపోతే తెల్లవార్లూ నిద్దరుండదు'' అని ఒయ్యారంగా ఒంపులుతిరిగి విసవిసా వెళ్లిపోయింది.

సూర్యం పడకమీద వాలేడు. నాలుగేళ్లయి అతగాడు పట్టే పుస్తకాల పురుగు. 'సీసు' రాసే దాకా తనువుంటున్నది ఏదేశం ఏఖండం ఏరాష్ట్రం అంకూడా జ్ఞాపకం చేసుకోకుండా లయిబ్రరీలకి, ప్రొఫెసరుకి అంకితం ఐపోయేడు. ఆఖరికి తను ఎడ్రసు మారినప్పుడు కూడా వసంతకి ఎడ్రస్ తెలియబర్చడం చెయ్యలేక పోయేడు.

వసంతతో గడిపిన మధుర ఘడియలన్నీ, స్మృతుల చిట్టాలో ఎక్కడో అడుగున, కల్లోల సాగరంలో ముత్యపు చిప్పలలో ముత్యాలలాగ వుండిపోయేయి.

ఈమధ్య నతగాడు చూసినఆడవాళ్లే తక్కువ. చూసిన కొంచెంమందీ దొరసానులు. అంచేతనే అతనికిగల సంప్రదాయమూ, సంస్కారమూ మాట అటుంచి, మనదేశంలో స్త్రీల దెప్పిపొడుపు మాటలు, యిష్టం, అవసరం, ఈర్ష్య వీటిని వాళ్లు ప్రదర్శించే విచిత్రమయిన రీతులూ అతనిలో చెరిగిపోయేయి.

లీలావతి ''ప్రెజిడెన్''గానీ, తిరుపతమ్మకి తన పెళ్లిగురించి కలిగిన ''ఏంగ్జయిటీ'' గాని అతగాడికి అవగత మవలేదు.

వసంత మాత్రం నాలుగేళ్లయినా అతని స్మృతుల పుటల్లో చెక్కు చెదరకుండా మూర్తీభవించి వుంది. ఆ వసంతకి చెబుదామని సీమనించి దిగి వారమయినా తిరక్కుండా ఎక్స్‌ప్రెస్‌రైలెక్కి ఆవూరొచ్చేశాడు.

వసంత అప్పుడు 'సెండాఫ్' విస్తున్నప్పుడు సూర్యం మరిచిపోకండిమా!

'అథవా మీ పుస్తకాల్లో మీ మస్తకం పారేసుకున్న హృదయంలో నాదేనుమా జాగా' అని కిలకిల నవ్వింది.

సూర్యం వసంతని ఎంతో జ్ఞాపకం తెచ్చుకున్నాడు. అలంకారాలు వేసుగుని తల్చుకుందామని అతడు చేసిన ప్రయత్నం వృధా అయ్యింది. తనుచేసిందా కెమెస్ట్రీ రిసెర్చి—తెలుగు పుస్తకాలు కావ్యాలూ మర్చిపోయి, అసలు తెలుగు విని మాటాడి ఎన్నో సంవత్సరాలు.

వసంతది కవితా హృదయం. ఆమెచెప్పింది సూర్యం భావుకుడని. అది తల్చుకుని కొంచెం గర్వపడ్డాడు సూర్యం.

వసంత తలపే పులకింత—అది ఒక అలౌకిక మయిన అనుభూతి. కళ్ళుతెరిచి దీపంకేసి చూస్తూ, చాలాసేపు సూర్యం వసంతని కలలుగన్నాడు.

తను ఆమె మొదటిసారి పిక్‌నిక్‌లో ఎలాకల్సుకున్నదీ.........

తను గోస్తనీ నది సముద్ర ప్రవేశం చేసిందగ్గర సర్దాగా అటూ యిటూ తిరిగేసి చిన్ని చిన్ని శంఖాలు ఏరు కొచ్చాడు. అందులో ఒకట తన పిడికిలి బిగించి, చూపుడు వేలికి, మధ్య వేలికి నడుమవుంచి ''యిాల'' వూదేడు. ప్రొఫెసరుగారు మరికొంతమంది విద్యార్థులు తనకేసి కొరకొరా చూసేరు. తను గతుక్కుమన్నాడు.

బిక్కు బిక్కున శంఖం కింద వదిలేస్తూ అమ్మాయిల కేసి యధాలాపంగా చూసేడు.

వసంత పెదిమలకొస నించి సన్నని జడివాన లాగ నవ్వడం చూసేడు. పులకించి పోయేడు.

వసంతది పసిపిల్ల హృదయం. చంటిపిల్ల సర్దాలు. తనని శంఖం అడిగింది. ఎలాగవూదను అని రెండు మూడుసార్లు ప్రయత్నించి వూదేసింది. గభిక్కున సిగ్గుపడి ఆ శంఖం తనమీదవదేసి గుళ్లోకి పారి పోయింది. అది భీమిలిలో. నరసింహ స్వామి గుళ్లోకి తనూ వెళ్లేడు. ఆమె వెనకాలే నించొని దేవుడికి దణ్ణం పెట్టేడు.

తర్వాత రెండోసారి క్లాసునించి అమాంతం బయటికి వచ్చేసి ''రోమన్ హాలిడే'' సినిమాకి ఎలా వెళ్ళిందీ యీలాగే ఎన్నో తియ్యని సంఘటనలు ఎదురు మదురుగా కళ్ళముందు కల్పించుకుని తర్వాత యికవుండ బట్టలేక లేచి కొంత సేపు పచార్లు చేసేడు.

అప్పటికప్పుడు వసంతను కల్సుకుని తను సాధించిన విజయం చెప్పాలి — ఇంతవరకూ తనకి ఆస్ట్రేలియాలో ఒక గోల్డు మెడలు ప్రయిజు వచ్చిందని అమ్మకి కూడ తెలియదు. అసలు వసంతకి తాను అనుకున్నట్లు అమెరికా గాక ఆస్ట్రేలియా వెళ్ళినట్లు కూడా తెలియదు. అతని మూఢతకి అతనే కించపడ్డాడు. సూర్యం అసలు అమెరికాకి వెళ్ళి సొంత ఖర్చుల మీదనయినా చదువుదామనుకొని బయలుదేరేడు. అదృష్ట వశాత్తూ ఆస్ట్రేలియాలో స్కాలర్‌షిప్ దొరికింది.

ఏది ఏమయినా తను వసంతకే స్వయంగా చెవులో యీ గోల్డు మెడల్ సంగతి చెప్పాలని అతని ఉబలాటం. రెక్కలుంటే రివ్వున వాలుదామనిపించేది.

చివరికి గోడ గడియారం టంగు టంగున రెండు గంటలు కొట్టింది. సూర్యం బలవంతంగా నిద్దర పోవాలనుకున్నాడు. ఉద్వేగం తొక్కిపట్టి ప్రక్కమీద కూచున్నాడు. దుప్పటి కప్పుకొని పడుక్కున్నాడు.

అంతలో అతనికి కనుమూత పడే లోపున ఆఖరి ఆలోచనగా 'వసంత ఆమె మావయ్య దగ్గిరే వున్నాడు'' అని అదోలాగున తట్టింది.

'మావయ్య' అని ఎప్పుడో వసంత కూడా పొగిడి చెప్పినట్లు గుర్తు. సూర్యం మనసు వికలమయి పోయింది. తను మహా ''అశాస్త్రం'' లో ఆగార్డి అయినట్లు.

''ఆడదాన్ని నమ్మకూడదు. ఈపాటికి ఆ మావయ్యకీ వసంతకీ యిద్దరు పిల్లలు కూడా పుట్టి వుంటారు'' అనుకున్నాడు.

ఉదయం లీలావతి అతని మొహంలోకి తీక్షణంగా చూసి ''తెల్లవార్లూ జాగారం చేసేరా ఏమిటి? — నిన్న మాస శివరాత్రట కూడా లెండి — అత్తయ్య చెప్పింది.... మంచిదే! పుణ్యం కూడా కలిసి వస్తుంది'' అని కొంచెం వ్యాతిశయంగా నవ్వింది.

ఈచప్పుడవనికొరడా దెబ్బసూర్యానికి తగలక పోనుగావి అతడేకొరివితో బుర్ర గోక్కున్నట్లు లీలావతినిఅడిగేడు,

''ఇంతకీ నేను వసంతగురించి ఆలోచిస్తున్నానని మీరే చెప్పారుగా ... అంచేత ఆమె ఎక్కడున్నదీ, ఏంచేస్తున్నదీ, ఈ గడిచిన నాలుగేళ్ళల్లో మీరు ... '' లీలావతి చాలా అయిష్టం

గానే విన్నది. ఆర్ద్రోక్తిలోనే అతన్ని అందుకుని ఆవేశపూరితమైన కంఠంతో, గబగబా కంచుగంట లాగా చెప్పింది.

"ఆమెని చూసి మూడేండ్లు. ఆమెకి పెళ్ళయ్యిందీ లేందీ, అయితే పిల్లలెంతమంది లాంటి విషయాలు నాకు తెలియవు. ..." అని మళ్ళీ, "అయితే, మీ కామె ఉత్తరాలుకూడా మానేసిందన్నమాట" అన్నది వ్యంగ్యంగా.

"దౌర్భాగ్యం. మారిపోయిన అడ్రసు తెలియబర్చకపోవడం నాదే తప్పు." అనుకున్నాడు సూర్యం. కానీ మాటలు అతని పెదవులపై ఆడలేదు.

లీలావతి కొంచెం తీవ్రమైన కంఠంతో అంది "ఐనా మీరు అడిగారు కనుక అంటున్నాను. ఎక్కడికో ఆస్ట్రేలియాకు వెళ్ళిపోయిన మీకోసం నాలుగేళ్ళు — ఇంటిమీదకు పాతికేళ్ళువచ్చి పైబడుతున్నా,, ఎవటి మెడిగట్టు కూర్చోదు. అథవా మీ వసంత పాతివ్రత్య శిరోమణియేమో నాకు తెలియదు."—

కొంచెంసేపులీలావతి ఉచ్ఛ్వాస, నిశ్వాసాలబుస తప్పిస్తే, ఆ యిద్దరిమధ్య నిశ్శబ్దం అలుము కుంది.

సూర్యం సిగరెట్టు ముట్టించి, తెగపీల్చి లీలావతిమీద కసిని, అనుకోకుండా వసంతమీద కలిగిన అసహ్యాన్ని కంట్రోల్ చేసుకుందామని ప్రయత్నించేవాడు.

లీలావతి ఆఫీసుకు వెళ్ళగానే — ఆమెకి తన మనుపు, సంస్కారాలు పుట్టిపడేటట్లుగా సభ్యతాయుతంగా ఒక ఉత్తరం వ్రాసి అక్కడ బల్లమీద వుంచి తిరపతమ్మకికూడా చెప్పకుండా స్టేషన్‌కు వెళ్ళిపోయాడు.

గబగబా విశాఖపట్నం టిక్కెట్టు కొన్నాడు.

రైల్లో మళ్ళీ వసంతను గురించి మథనపడ్డాడు. గతం స్మృతులన్నీమరిచిపోయి లీలావతి చెప్పిన కోణంలోంచి మాత్రం వసంతను తూచితూచి ఆలోచించాడు. ఎంచేతనో వసంతమీద నమ్మకం కుదురలేదు. నిజమే మెడిగట్టు కూర్చుంటుందా అనిపించింది.

మనసు పరిపరివిధాలుపోగా, నిలకడలేకండా త్రోవలో రాజమండ్రిలోనే దిగి, పోయి తల్లివుంటున్న తాతగారివూరికి వెళ్ళిపోయాడు.

లీలావతి ప్రిజుడిస్‌కి అర్థముందేమోగానీ, సూర్యం హేట్రెడ్‌కి కారణం లేదు. అతను చదువుకు సంపాయించుకున్నది కుహనాసంస్కారమనీ, అతనికి కలిగిన శంక నిరర్థకమనీ గ్రహించలేక మనోదౌర్బల్యంతో యిల్లు చేరుకున్నాడు సూర్యం.

తల్లి కొడుకును చూసుకుని కొండంత సంబరపడింది. పెళ్ళివిషయమై కదిపి, సూర్యాన్నిఎంతో ఉత్సాహంతో అడిగింది. "ఆ మూడుముళ్ళూ వేసి, కోడలుదాన్నియింటికితెచ్చిపెట్టుకున్నానంటే యింకేమీ అక్కరలేదు నాయనా" అని.

"అమ్మా! విశాఖపట్నంవెళ్ళి వుద్యోగంలోచేరి ఒక సంవత్సరమైనా కుదుటపడందే నాకేం పెళ్ళి వద్దమ్మా" అని విసుక్కుని తల్లిని అక్కడే వదిలి సూర్యం తనగదిలోకి వెళ్ళిపోయాడు. తల్లి ఈ జవాబుకి నిరాశపడ్డా, కొడుకుకి వుద్యోగం దొరికిందని విని, సంతోషించింది.

డ్రాయరు సొరుగు తీసాడు. దానిలో బూజు పట్టి మాసిపోయిన కవర్లు కొన్ని అవుపించాయి.

"అమ్మా ఏమిటివి" అని గట్టిగా కేకేసేడు తల్లిని. ఆమె అక్కడికి వచ్చేసరికి అతను అవి చించి చదవడానికి ఉపక్రమించింది.

"అవా బాబూ! ఏవీ చూడనీ" అని ఆమెడ చూసి, "సినేనుట మీ తాతయ్య అందులో పెట్టమన్నాడు. ఎప్పుడో ఎవల్లో నీ స్నేహితులయ్యుంటారు ... రాసుంటారన్నాడు." అని.

"ఔనా" "కాదా" అన్నట్టు కొడుకు దగ్గరగా వచ్చి నించున్నది. "సరేలే" అన్నాడు సూర్యం. తల్లికి తన ఆందోళన తెలియనివ్వకూడదని, సొరుగు మూసేసి అక్కన్నుంచి లేచి వెళ్ళిపోయేడు.

ఒంటరిగా సూర్యం ఒక్కొక్క ఉత్తరమేవిప్పి చదువుకున్నాడు. అన్నింటిమీదను ఒకే కాపీలు.

"వసంత" — తన వసంత రాసింది. గుండెల కదుముకున్నాడు. లీలావతినీ మామయ్యనీ అంతా మర్చిపోయేడు.

"నాకు నేను అమెరికాకి రాసిన యీ వుత్తరాలు తిరిగి వచ్చేసాయి..... ఎంత బెంగపడ్డానో దేవుడికి తెలుసు....."

"మీరు ఆస్ట్రేలియాలో వున్నారని విని... నాకు తెలియబరచక పోయినా భరించేను ...మీరు తిరిగి వచ్చాక నయినా యివిఅందుకోండి ... నాకు వసంతకాలం తీసుకొని రండి... అంతవరకూ మీరేమో...." —

"ఈ దేశంలో ఆడపిల్ల వుద్యోగం వెయ్యడం అంటే నరకం అనుభవించడ మన్నమాట!"

ఆ వుత్తరాలలోని ముఖ్యమయిన యీ వాక్యాలను పదేపదే చదువుకున్నాడు.

నరనరాల్లో విద్యుత్ప్రవాహమంత చురుకైన పులకింత అయ్యేడు.

సభిక్కున యిక్కడ మాయమై అక్కడ వసంతముందు ప్రత్యక్ష మవ్వాలనిపించింది. శక్తివుంటే కాలికొద్దీ పరిగెత్తేవాడు.

అటూ యిటూ గదిలోనే కాలుకాలిన పిల్లిలాగ పదేపదేతిరిగి,తనవుద్యోగంకూడావసంతవుత్తరంలో రాసిన విశాఖపట్నంలోనేగదా అని తమాయించుకొన్నాడు. కాని వుత్తరాలు రాసి సుమారు రెండు సంవత్సరాలు—దానిమీది ఎడ్రస్‌కూడా అంతంత మాత్రమే. మళ్లీ అతనిలో కలత తలెత్తింది. కూలబడ్డాడు.

సూర్యం వెళ్లి విశాఖపట్నంలో వుద్యోగంలో జాయిను ఐ వారంరోజులదాకా ఆ ఎడ్రస్ ఆధారంతో వసంతకోసరం వెదుక్కున్నాడు. కాని లాభంలేకపోయింది. పోనీ యిల్లు మారిపోయేరేమోనని వుద్యోగం తెలుసుకుందామా అంటే అదీ తెలిసింది కాదు. సూర్యం నిస్పృహచెందీ మళ్లీ అనుమానాలతో సతమత మయ్యాడు.

నిరాశతోకూడా, సూర్యం అవుపించిన అందరి అమ్మాయిల్లోనూ వసంతని వెదకడం మాత్రం మానలేదు. వసంతకోసరం సదా అతని హృదయం ఆరాటపడేది. మస్తిష్కంలో మాత్రం ఆమె తలంపు వృథా అనిపించేది.

వెయ్యి కళ్లతో వెతికే అతని ఆశ ఒకనాడు ఫలించింది.

సముద్ర ఒడ్డున ఎవరో ఒక యువతి మరో మధ్యవయస్కుడితో కలిసి కూర్చుని తదేకంగా చూడడం, అదే సమయంలో సూర్యంకూడా వాళ్లని పరకాయించి చూసి "వసంతా ఏమిటి చెప్పుమా" అనుకోడం జరిగేయ్.

వసంత గబగబా లేచి కెరటంలావచ్చి "మీరా మీరేనా" అని రొప్పుతూ అంటూ సూర్యాన్ని పరిశీలనగా చూస్తూ ప్రక్కనే చతికిలబడింది. ఆమె విస్మయంతోనూ ఆనందంతోనూ ఉక్కిరిబిక్కిరి అయ్యింది.

సూర్యంకూడా తబ్బిబ్బయి పోయేడు. కట్టకండా లాటరీ వచ్చినంత గాభరాగా "వసంతా ... నువ్వేనా ... ఎంత వెదికాను" అన్నాడు.

ఇంతలో ఆప్రక్కనేవున్న వ్యక్తికూడా వచ్చి "నమస్తే చాలారోజులయింది మిమ్మల్ని చూసి" అన్నాడు. అతన్ని చూడగానే సూర్యం కించిత్ ద్వేషంతో "ఔను" అన్నాడు.

వసంత సూర్యానికి పరిచయం చేసింది అతగాడిని "మామయ్య" అని.

సూర్యం కొత్తగా వున్నాడు. వసంత, కళ్లంత చేసుకుని చూసింది. ఎడబాటువేత కొంత బిడియము పడింది.

వసంత అంతా మారిపోయిందనిపించింది సూర్యానికి. నాలుగేళ్లక్రితం సన్నంగా సన్నజాజి తీగెలాగ ఒళ్ళూ, సోగకళ్లలో వుండే వసంత యిప్పుడు కాస్త ఒళ్లుచేసింది. పచ్చంచు ముతక నేత గళ్లచీర కట్టుకుంది. అదే అంచు చేతులున్న జాకట్టు వేసుకున్నది. జుత్తు బోలెడుండేది. రెండుజెడలు వేసుగునా కొట్టవచ్చినట్టుండేది. ఇప్పుడు అంత లేదు. ముడి చుట్టుగుని ఒక్క గులాబీ పువ్వుమాత్రం. వుంచుకుంది. మొహాన పెద్ద కుంకుమ బొట్టు వున్నది. వెనకటి లిప్‌స్టిక్ పెదిమలుగాని "పాంఛ్ చీక్స్" గాని లేవు.

సూర్యానికి ఎంతో ఆనందం కలిగినా యెక్కడో వెలితి కనపడింది. ఇంకా ఆమెలో పాత చిలిపితనమే కళ్లల్లోనించి తొంగిచూస్తున్నాఎందుకనో అతనికి తృప్తిగా లేదు. ముఖ్యంగా అతనికి ఆ మామయ్య పొడ కిట్టిందికాదు.

ఆనందంతో కిలకిలమని అమాయకంగా మాటాడేస్తూ వసంత నడిపించుకొని పోతున్న సూర్యం బరువుగా నడక సాగించేడు.

"వసంత యిల్లు" — సూర్యానికి మాత్రం ఆ "మామయ్య ఇల్లు" బొత్తిగా చిన్నది. చుట్టూకాంపౌండుగానిగార్డెన్‌గాని లేవు. నాలుగ్గదులు వున్నాయి. అందులో ఒకటి డ్రాయింగ్

రూం. అందులో కూచోబెట్టింది సూర్యాన్ని. చిన్న పోతూ కూచున్నాడు సూర్యం.

"తలివమ్మా గదుల్లో ఒకటి వంటిల్లు ఇంకోటి కామన్ హాలు. మరొకటి మావయ్యా వాళ్లది." అని చెప్పింది వసంత.

'వాళ్లది' అన్న మాట వినగానే ప్రాణం తెప్పరిల్లింది.

మనసునితోసి హృదయం రాజనింది. ఒడ్డున పడ్డ చేపమీదయిన్ని నీళ్లు పోసినట్లుందిఆమాట.

"వాళ్లు" అంటే అని గొణిగేడు. "మా అత్తయ్యా మావయ్యా" అన్నది వసంత.

సూర్యానికి సగం మనోవ్యాధి కుదిరింది. కాని "యిందాక బీచ్‌లో వాళ్లిద్దరూ కూచున్న దృశ్యం జ్ఞాపకంవచ్చి ఒళ్లు మండింది. అతని సంస్కార సొదిలోయినా అయిపులేదు.

లటు సూర్యం బోలెడు చదువుకున్నవాడు. పి. హెచ్. డి. చేసి గోల్డు మెడలు సంపాదించు కున్నాడు. ఇటు సూర్యం తాత చెప్పుకోదగ్గ అహితాగ్ని — మాంచి సాంప్రదాయం సంస్కారం వున్న కుటుంబం. అయితేనేం ... శంకని తార్కికంగా ఆలోచించడం సాధ్యం అయ్యిందికాదు సూర్యానికి.

వసంత ఆడపిల్ల. తార్కికంగా, గాక సెంటిమెంటల్‌గా ఒక నిర్ణయానికి గభిక్కున వచ్చేసింది.

వసంత సూర్యాన్ని దెప్పిపొడవలేదు. గుచ్చి గుచ్చి ప్రశ్నలడగలేదు. దేవుడు తన తపస్సుకి మెచ్చి దివినుండి దిగివచ్చినట్లు — ఎన్నాళ్లగానో స్టేషనుతో పడిగాపులు పడగా, చివరకి స్వర్గానికి వెళ్లే రైలొస్తే, అందులో ఫస్టుక్లాసు సీటు దొరికినట్లు నిండుగా తృప్తిగా సూర్యాన్ని స్వీకరించింది.

ఎన్నో సంగతులు సన్నని సంగీతంలాగ వసంత చెబుతూవుంటే వ్యాధిపీడితునిలాగ విన్నాడు సూర్యం.

"నీ పెళ్లయిపోయిందనుకున్నాను సుమా" అన్నాడు అతను అనుకోకుండానే.

వసంత గభిక్కున ఎర్రగులాబీలో నించి ఎరుపంతా చెరిపేసినట్లు పాలిపోయింది.

"సూర్యం! మీరేమిటి ... అన్నారు" —


సహజంగా ఆకాశమంతా గుండెకాయతో ప్రేమిస్తుంది స్త్రీమూర్తి. వసంత "పళ్లె" లంత లేసి కళ్లనిండా నీళ్లు నిండేయి.

"అంతా మర్చిపొయ్యేరన్నమాట" అని వెక్కి వెక్కి యేడ్చింది.

తన 'పాపా'న్నంతా ఆమె కన్నీళ్లతో కడిగేసినట్లు కొంత రిలీఫ్ వచ్చింది గాని — అక్కడ మళ్లీ కొంత అవమానమూ, ఓటమిచేత కలిగిన అవమానమూ పీడించగా చలించనట్లు మవునంగా వున్నాడు.

ఇంతలో అక్కడికి వసంత అత్తయ్య కాబోలు వచ్చి "భోజనాలకి లేవండమ్మా వసంతా" అన్నది.

సూర్యం వారించలేదు. అచేతన మయిన బొమ్మలాగ భోజనందగ్గర వెళ్లి కూచున్నాడు.



శ్రీ బాలయోగి, ముమ్మడివరం.

వసంతకేసి ఎందుచేతనో చూసే ధైర్యంలేక మవునంగా భోజనందగ్గర కూర్చున్నాడు.

టేబుల్‌మీల్సు అలవాటయిపోవటంచేత, ముళ్ళమీద కూర్చున్నట్లు కూచున్నాడు.

వసంత దగ్గరగా కూర్చుని విసనక్రరతో విసురుతూండగా, అత్తయ్య వడ్డించింది . వడ్డి అన్నది :

"ఎప్పుడూ మన వసంతకు మీ తలంపు తప్ప మరోటిలేదు నాయనా" అని మళ్ళీ కొంచెం ఆగి 'మరి ఆఉద్యోగంలో నయినా నీపేరుటయిపుకొడు తుందేమో మరి...'' పోనీలేండి బాబూ యిన్నాళ్ల కయినా కనిపించేరు ..."

ఆవిడ బహువచనం ప్రయోగించినా చాలా చనువుగా మాట్లాడింది.

సూర్యం నిముషనిముషానికీ క్షమించరాని నేరం చేసినట్లు ఫీలయ్యాడు. కుమిలి పోయేడు. వసంత కేసి ఎట్టకేలకు ధైర్యంతెచ్చుకుని చూసేడు. నిర్మలమయిన సంగీతంలా వున్నాయి ఆమె కళ్ళు.

"నిజంగా ఆడపిల్లల బరువు నెత్తినెత్తుకున్న వాడిసంగతి ఆ దైవానికే తెలుస్తుందండి. వసంత మావయ్య లౌక్యంగా మాట్లాడాడు. "ఈ పిల్లని మా అక్కయ్య నాచేతికి వప్పచెప్పిం దగ్గర్నుంచీ యింతవరకూవిశ్రాంతి లేదనుకోండీ! ఎన్నోసార్లు పెళ్ళిచేస్తానని తొందరపెట్టాను కూడాను. కానీ ససేమిరా అనేది. ... అయినా అంతా దైవికం అని వూరుకోవాల్సి వచ్చింది."

సూర్యం వింటూ అన్నం కెలకడమేగాని, తిన టంలేదని చూసి వసంత మీకు మావంటలేమీ రుచించలేదు కదూ ... ఔను ... ఇంగ్లీషువాళ్ళయిపోయారు కాబోలు" అని నొచ్చుకుంది, కాని చిరునవ్వుతోనే దెప్పిపొడిచింది.

సూర్యం ఆలోచన తెంపేసేడు.

చదువుకున్నానన్నమాట మరిచిపొయ్యాడు,— తర్వాత సంస్కారం అంటే ఏమిటి? మనస్తత్వం ఏమిటి లాంటి చర్చలు బుర్రలో చెరిపేసేడు.

"నా పి. హెచ్‌డి కి గోల్డుమెడ లిచ్చారు వసంతా! గట్టిగా ఆమె కళ్ళల్లోకిచూసి గబగబా అనేసాడు.

"నేను నీకోసం ఎవరెస్టు జయించాను తెలుసా అన్నంత ధీమాగా, చైతన్యవంతంగా అన్నాడు ఆ వాక్యాన్ని. గట్టిగా అరిచినంతఉద్వేగంఉండి, అతని కంఠంలో.

వసంత ఎదనంతా వసంతకాలమై పులకించింది. తుర్రున గదిలోకి పారిపోయింది.